
సాక్షి ఒడిశా

బుధవారం । 4 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.20.422లు, బంగారం 1గ్రాము 50 మిల్లీగ్రాములు, వెండి 83 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి

వర్షాలకు ముందు పట్టణ ప్రాంతాల సన్నద్ధత గురించి గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి విభాగం మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో పట్టణ ప్రాంతాలకు చెందిన వివిధ అధికారులతో మంగళవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు.

- 8లో.



అంగుల్‌లో ఆడ ఏనుగు మృతి

అంగుల్ జిల్లా చెండీపాదా అటవీ ప్రాంతం డొంగాపాల్ సమీపంలో సౌరశక్తితో నడిచే కంచె దగ్గర ఆడ ఏనుగు చనిపోయింది.

- 8లో.

న్యూస్‌రీల్

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు క్యూ



దరఖాస్తుల కోసం క్యూలో ఉన్న తల్లిదండ్రులు

జయపురం: ఈ విద్యా సంవత్సరం నుంచి జయపురం కేంద్రీయ విద్యాలయంలో తరగతులు ప్రారంభమవ్వనున్నాయి. దీంతో తమ పిల్లలను విద్యాలయంలో చేర్పించేందుకు తల్లిదండ్రులు దరఖాస్తుల కోసం క్యూ కడుతున్నారు. సోమవారం నుంచి దరఖాస్తులు పంపిణీ ప్రారంభించారు. క్యూ ఆర్ కోడ్ స్కానర్ ద్వారా దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 241 దరఖాస్తులను ప్రజలు ఉచితంగా తీసుకున్నారు. ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయనున్నారు. అనంతరం ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. కేంద్రీయ విద్యాలయంలో ప్రథమ సంవత్సరం 1 నుంచి 5వ తరగతులు ప్రారంభించనున్నారు. ఒక్కొక్క తరగతిలో 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తారు.

ఎట్టకేలకు నిందితుడు అరెస్టు



అరెస్టు అయిన నిందితుడు రాజేష్ బోత్ర

జయపురం: ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిపి గర్భవతిని చేసి పరారైన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. బొరిగుమ్మ సమితి బీజేపీ నేత కుమారుడైన నిందితుడు రాజేంద్ర బొత్రను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. రాజేంద్ర ఒక మైనర్ బాలికను గర్భవతిని చేసిన ఘటనను మాఫీ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని వదంతులు ఉన్నాయి. ఈ విషయం బయట చెబితే చంపుతానని బాధిక కుటుంబాన్ని బెదిరించాడని ఆరోపణలు ఉన్నాయి. అయితే రాష్ట్రంలో రాజకీయ ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు అతడిని పోలీసులు అరెస్టు చేశారు.

వైభవంగా అమ్మవారి పండగలు



అమ్మవారి పండుగలకు విరాళం ఇస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి మండలదేవి గ్రామంలో అమ్మవారి పండగలు ఐదు రోజులుగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారి పండగల చివరి రోజు కావడంతో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి హాజరయ్యారు. సుదీర్ఘ పదేళ్ల తర్వాత మండలదేవి గ్రామంలో అమ్మవారి పండుగలు జరుపుకోవడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి బంధువర్గం విచ్చేసి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు.

శబరి నదిలో మునిగి యువకుడు మృతి



నది ఒడ్డున తేలుతున్న అరుణ్ మృతదేహం



అరుణ్ (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోటేర్ పంచాయతీ కన్యాశ్రమం సమీపంలోని శబరి నదిలో స్నానానికి వెళ్లిన యువకుడు నదిలో మునిగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పోటేర్‌కు చెందిన అరుణ్ గౌడ్ అనే యువకుడు ఆదివారం మధ్యాహ్నం స్నానానికి వెళ్లాడు. అయితే అటు నుంచి ఆయన ఇంటికి రాలేదు. ఎక్కడికో స్నేహితులతో వెళ్లుంటాడు అని కుటుంబ సభ్యులు అనుకున్నారు. కాగా మంగళవారం ఉదయం పోడియా సమితి ఉందరుకండ పంచాయతీ ఎంపీవీ 57 గ్రామం వద్ద శబరి నది ఒడ్డున మృతదేహం తేలుతూ కనిపించింది. వెంటనే స్థానికులు కలిమెల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కలిమెల ఐఐసీ ముకుందో మేల్కా సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు.

ఉక్కపోతతో

ఉక్కిరిబిక్కిరి..!



- ఊరించి ఊరుకున్న రుతు పవనాలు
- అమాంతం పెరిగిన ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న ప్రజలు

భువనేశ్వర్: రాష్ట్రంలో రుతు పవనాలు ఊరించి ఊరుకున్నాయి. వారం రోజులు ముందుగానే ఈ ఏడాది రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయనే ఆనందం వెంటనే ఆవిరైపోయింది. ప్రస్తుతం రుతు పవనాల కదలిక మందగించడంతో అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న ఆకస్మిక మార్పులతో రుతు పవనాల కదలిక బలహీన పడిందని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఈనెల మధ్యకాలం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని తాజా వాతావరణ సూచన జారీ అయింది. జూన్ మధ్య వరకు రాష్ట్రంలో రుతు పవనాలు పుంజుకునే అవకాశం లేదని భారత వాతావరణ శాఖ ఐఎండీ తాజా అంచనా. రాష్ట్ర వాతావరణంలో ఉష్ణోగ్రత మరియు తేమ స్థాయిలు స్థిరంగా కొనసాగనున్నాయి.

మారుమూల ప్రాంతాల్లో వర్షాలు

తీరప్రాంత ఒడిశాలో తీవ్రమైన వేడి కొనసాగుతుండగా మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, కెంజ్ఞహర్, సుందర్‌గఢ్ వంటి అంతర్గత జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిపించే కాల వైశాఖి వాతావరణం అలముకుని ఉంది. దీని ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక ఉపశమనం లభిస్తోంది. కాగా పూరీ, ఖుర్దా, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, జాజ్‌పూర్, భద్రక్, బాలాసోర్, గంజాం, గజపతి మరియు నయాగఢ్ జిల్లాలకు వాతావరణ శాఖ వడగాడ్పుల హెచ్చరిక జారీ చేసింది. ఈ జిల్లాల్లో వేడి మరియు తేమతో కూడిన ఉక్కపోత పరిస్థితులు నెలకొని ఉంటాయి. ఈనెల 6వ తేదీ వరకు 11 తీరప్రాంత జిల్లాల్లో వడగాడ్పుల వాతావరణం నేపథ్యంలో ఎల్లో అలెర్ట్ ఉంది. గత నెల 31 నుంచి రాష్ట్రంలో రుతుపవన వర్షాలు తగ్గాయి.

అల్పపీడనం ప్రభావంతో...

బంగాళాఖాతం మరియు అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రుతు పవనాలు ఒడిశా ప్రాంతానికి సాధారణం కంటే వారం ముందుగానే ప్రవేశించాయి. అయితే తదుపరి పురోగతి లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రొజ్జొ పండుగ వరకు రాష్ట్రవ్యాప్తంగా రుతు పవనాల కదలికలు లేకపోయే పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి రుతు పవనాలు తాత్కాలికంగా విరామం పొందినట్లేనని తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మొదట్లో చెల్లాచెదురుగా వర్షాలు కురిపించిన రుతుపవనాల ముందస్తు తిరోగమనం ఈ పరిస్థితికి కారణమని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మంగళవారం ఉదయం 8.30 గంటలకు భువనేశ్వర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 33.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. 67.2 శాతం తేమ స్థాయి కారణంగా నగరంలో తీవ్రమైన ఉక్కపోత వాతావరణం నెలకొంది. రాష్ట్రస్థాయిలో బాలాసోర్‌లో అత్యధిక ఉష్ణోగ్రత 34.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. తదుపరి స్థానాల్లో పూరీలో 34.6 డిగ్రీల సెల్సియస్, చాంద్‌బాలిలో 33.4 డిగ్రీల సెల్సియస్, పారాదీప్‌లో 32.8 డిగ్రీల సెల్సియస్ నమోదు అయింది.

కొరాపుట్ జిల్లాకు రెజంగళ రాజ్ కలశ యాత్ర



జయపురం చేరిన రెజంగల్ కలశ యాత్ర

జయపురం: చైనా యుద్ధంలో మరణించిన వీర సైనికులకు గుర్తుగా దేశవ్యాప్తంగా చేపడుతున్న రెజంగళ్ కలశ యాత్ర మంగళవారం కొరాపుట్ చేరింది. కొరాపుట్ జిల్లా యాదవ మహాసభ సభ్యులు యాత్రకు ఘన స్వాగతం పలికారు. మహా సంఘ జిల్లా అధ్యక్షుడు మదన మోహన్ నాయిక్ నేతృత్వంలో కార్యదర్శి రాజేంద్ర కుమార్ గౌడ, యాదవ మహాసంఘ రాష్ట్ర యువ సమాజ్ అధ్యక్షుడు అమర నాయిక్, ఉపాధ్యక్షుడు అమిత్ నాయిక్, కవిరాజ్ పరమేశ్వర పాత్రో, పరశురాం నాయిక్ మొదలైనవారు స్వాగతం పలికి యాదవ భవనానికి తోడ్కొని వచ్చారు.

కార్యక్రమంలో ప్రమోద్‌కుమార్ గౌడ, నరేంద్ర నాయిక్, రబీ నారాయణ గౌడ, రామచంద్ర మహంకుడో, హరిగౌడ, విజయ గౌడ తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి

నలుగురు మృతి



నలుగురిని బలిగొన్న సెప్టిక్ ట్యాంక్



సంఘటన స్థలంలో త్రిలోచన్ బోత్ర మృతదేహం



అమిర్ కొరాని బయటకు తెస్తున్న దృశ్యం

కొరాపుట్: నిర్మితమవుతున్న సెప్టిక్ ట్యాంక్‌లో ప్రమాదవశాత్తు నలుగురు యువకులు మంగళవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని నందాహండి సమితి పదాల్‌గుడ గ్రామంలో సెప్టిక్ ట్యాంక్ నిర్మితం అవుతోంది. అందులో దిగిన ముగ్గురు కార్మికులు అమిర్ కొర (30), త్రిలోచన్ బోత్ర (25), లలూ రణ (26)లు అక్కడికక్కడే అచేతన స్థితికి గురయ్యారు. ఇది గమనించిన మిగతా కార్మికులు భయాందోళనతో కేకలు వేశారు. ఇది తెలుసుకున్న స్థానిక వ్యాపారస్తుడు ఎస్.సంతు (28) వారిని రక్షించడానికి లోపలకి దిగగా అతను కూడా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో మరెవ్వరూ లోపలకి దిగడానికి సాహసం చేయలేకపోయారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి నలుగురిని బయటకు తీశారు. వీరిని వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ముగ్గురు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. సంతుని ఐసీయూలోనికి తరలించి చికిత్స అందిస్తుండగా అతను కూడా మృతి చెందాడు. ఈ వార్త జిల్లావ్యాప్తంగా విషాదం నింపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి స్పందిస్తూ తీవ్ర సంతాపం ప్రకటించారు. మృతి చెందిన ప్రతీ కుటుంబంకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఎంపీ బలబద్ర మజ్జి, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జిలు స్పందిస్తూ మృతులకు సంతాపం ప్రకటించారు.



లలూని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నీటికుంటలో పడి బాలుడు మృతి



బాలుడి మునిగిన నీటికుంట



బాలుడి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి ఆండ్రాహల్ పంచాయతీ కాతామీగడ గ్రామంలో నీటికుంటలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సంతోష్ కావాతి(3) తోటి పిల్లలతో కలిసి నీటి కుంట దగ్గర స్నానానికి వెళ్లాడు. అయితే ఆ సమయంలో ప్రమాదవశాత్తు మునిగిపోవడం జరిగింది. సమీపంలో ఉన్నవారు బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. ముదిలిపోడ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగించనున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



చైతన్య రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ దాస్

పర్లాకిమిడి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ సూచించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చైతన్య రథాన్ని ఆయన జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సచేతన రథం ద్వారా జిల్లాలోని సమగ్రంగా అన్ని సమితి కేంద్రాలు, కాశీనగర్ ఎన్ఏసీ, పురపాలక పరిధిలో ప్రజలకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తారు. ఈ ప్రచారం జూన్ 24 వరకు చేపట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఎం ఫాల్గుణ మఝి, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమార్ పటేల్, ఎస్ఐ మఝి శోబోరో, నోడల్ ఇన్‌స్పెక్టర్ మోనూ ఆయాల్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఏర్పాటు చేయాలి

జయపురం: జయపురం నుంచి చత్తీష్‌గడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్, పాండిచేరి రాష్ట్రంలోని యానాంకు వాల్వో బస్సులు వేయాలని జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కోరింది. ఈ మేరకు చాంబర్ అధ్యక్షుడు వి.ప్రభాకర్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీకి ఈ విషయంపై లేఖ రాశారు. ఓఎస్ ఆర్టీసీ వారు జయపురం మీదుగా భవానీపట్న, రాయిఘర్, హైదరాబాద్‌లకు వాల్వో స్లీపర్ బస్సులు ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే జయపురం నుంచి రాయ్‌పూర్, యానాంలకు బస్సులు వేస్తే కొరాపుట్ జిల్లా ప్రజల వాణిజ్య, వ్యాపారాల ఉన్నతికి, విద్యార్థుల ఉన్నత చదువులకు, వైద్య సౌకర్యాలకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం



రఘునాథ్ మందిరం వద్ద ర్యాలీ సిద్ధంగా ఉన్న సైకిలిస్టులు

జయపురం: పట్టణంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం ఘనంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక సోనీ సైకిల్ మార్టు వారి అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మొదట రఘునాథ్ మందిరం వద్దకు చేరిన సైకిలిస్టులు, అక్కడ నుంచి 26వ జాతీయ రహదారి పాత బస్టాండ్ ప్రధాన జంక్షన్ వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ వల్లభాయి పటేల్ మార్గం మీదుగా రథోపాడియ కూడలికి చేరింది.

సైక్లింగ్ వలన కలిగే ప్రయోజనాలు తెలియజేసేందుకు కృషి చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త మోహనరావు వెల్లడించారు. సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యం పొందవచ్చన్నారు.




ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన యువత

ప్రాంతీయ స్థాయి సంబంధాలు అన్వేషించాలి

- వియత్నం పర్యటనలో గవర్నర్ హరిబాబు ప్రతిపాదన
- డా నాంగ్ పీపుల్స్ కమిటీ ఛైర్మన్ లే ట్రుంగ్ చిన్‌తో సమావేశం



వియత్నాంలో ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



డా నాంగ్ పీపుల్స్ కమిటీ ఛైర్మన్ లే ట్రుంగ్ చిన్‌తో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: బుద్ధుని పవిత్ర అవశేషాలను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు వియత్నాం సందర్శించిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి సరికొత్త ప్రతిపాదనని తెరపైకి తీసుకొచ్చారు. ఒడిశా మరియు వియత్నాంలోని డా నాంగ్ నగరం మధ్య ప్రాంతీయ స్థాయి సంబంధాలను అన్వేషించాలని ప్రతిపాదించారు. వియత్నాం పర్యటనలో భాగంగా డా నాంగ్ పీపుల్స్ కమిటీ ఛైర్మన్ లే ట్రుంగ్ చిన్‌తో జరిగిన సమావేశంలో ఆయన ఈ ప్రతిపాదన చేశారు. ఈ సందర్భంగా ఒడిశా ఘన చరిత్ర, బలమైన సాంస్కృతిక సంప్రదాయాలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధి కలిగిన రాష్ట్రమని వివరించారు. రాష్ట్రంలో చాలా ముఖ్యమైన బౌద్ధ ప్రదేశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. డా నాంగ్ ఆసక్తి కలిగి ఉంటే, మన రెండు ప్రాంతాల మధ్య సంబంధాలను బలపరిచేందుకు మనం అన్వేషించవచ్చునన్నారు.

డా నాంగ్ చారిత్రాత్మక నగరం

డా నాంగ్ భారీ పురోగతి సాధిస్తున్న అందమైన చారిత్రాత్మక నగరమని కంభంపాటి హరిబాబు ప్రశంసించారు. డా నాంగ్ ఒక ప్రధాన ఓడరేవు, ఉన్నత సాంకేతికత కేంద్రంగా, ఆర్థిక మరియు పర్యాటక కేంద్రంగా ఎదగడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. మధ్య వియత్నాంలో శక్తివంతమైన తీరప్రాంత నగరంగా డా నాంగ్ భారతదేశం మరియు వియత్నాం మధ్య ఆర్థిక, వాణిజ్య సహకారానికి దోహదపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బుద్ధుని పవిత్ర అవశేషాల కోసం చేసిన అద్భుతమైన ఏర్పాట్లకు వియత్నాం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బౌద్ధ మతం దాదాపు 1800 సంవత్సరాలుగా భారతదేశం, వియత్నాం మధ్య బలమైన సంబంధాన్ని ఏర్పరిచిందన్నారు. భారతదేశం బౌద్ధ వారసత్వాన్ని విలువైనదిగా పరిగణించి బౌద్ధ స్థలాల రక్షణ, సంరక్షణ మరియు ప్రోత్సాహానికి ప్రాధాన్యతనిస్తోందని వెల్లడించారు.

రెండు దేశాల మధ్య సహకారం

వాణిజ్యం, రక్షణ, పర్యాటకం, ఆరోగ్యం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, విద్య మరియు స్థిరమైన అభివృద్ధి వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారం విస్తరిస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. యోగా, సాంస్కృతిక మార్పిడి మరియు విద్యా సంబంధాలను ప్రోత్సహించడానికి భారత రాయబార కార్యాలయంతో కలిసి పని చేయడంలో డా నాంగ్ మద్దతును అభినందించారు. రెండు దేశాల మధ్య మరిన్ని ప్రత్యక్ష విమానాలు ఇరుప్రాంతాల ప్రజల సంబంధాలను మెరుగుపరచడంలో సహాయపడ్డాయని పేర్కొన్నారు. మధ్య వియత్నాంలోని మైసలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంలో పురాతన దేవాలయాలను పునరుద్ధరించడంలో భారత పురావస్తు బృందం చేసిన కృషిని ప్రశంసించారు. ఈ ప్రాజెక్ట్ భారతదేశం మరియు వియత్నాం మధ్య సన్నిహిత చారిత్రక మరియు సాంస్కృతిక సంబంధాలకు బలమైన చిహ్నంగా మారిందన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటు విద్యాసంస్థల్లో దోపిడీ అరికట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యా హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాల పేరిట దోపిడీ జరుగుతోందని, అటువంటి నిర్వాహకులపై జిల్లా విద్యాశాఖాధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడుగారి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోపిడీలకు పాల్పడుతున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

నేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి


మగ్గాన్ని పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల: మగ్గమున్న ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటియూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, చేనేత కార్మిక సంఘం నాయకుడు నక్కిన అసిరప్పుడు డిమాండ్ చేశారు. మంగళవారం లావేరులో పర్యటించి చేనేత కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించి అనంతరం మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులు గిట్టుబాటు ధరలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలకు రుణ మాఫీ చేసి ఆప్కో ద్వారా ప్రభుత్వం వస్త్రాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు కె.శంకరరావు, కె.రామారావు, యు.గంగరాజు, కె.గంగరాజు, భద్రకాళీ, బి.వెంకటరావు, యు.కాశీవిశ్వేశ్వరరావు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు ఆహ్వానం


కన్వీనర్ సుధాకరరావు

ఎచ్చెర్ల: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు మంగళవారం షెడ్యూల్ విడుదలైందని ఐటీఐ ప్రవేశాల జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 5 నుంచి 10 వరకూ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, మోటార్ వెహికల్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడ్, వెల్డర్, డీజిల్ మెకానిక్, కట్టింగ్, టైలరింగ్, కోపా తదితర ట్రేడ్‌లలో ప్రవేశాలను కల్పిస్తున్నామని వివరించారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ కళాశాలలో 640 సీట్లు, 20 ప్రైవేటు కళాశాలల్లో 2,872 సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు.

సిమెంట్ లారీ దగ్ధం


కాలిపోతున్న లారీ

నరసన్నపేట: తామారాపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సిమెంట్ లారీ దగ్ధమైంది. విశాఖ నుంచి పూరీ వెళ్తుండగా తామరాపల్లి వద్దకు వచ్చే సరికి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేయగా లారీ నిలుపు చేసి తగిన జాగ్రత్తలు తీసుకొనే లోపే మరింతగా మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా ఎస్ఎఫ్ఓ వరహాలు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోనికి తెచ్చారు. అప్పటికే లారీ కాలిపోయింది. ఈ ఘటనలో రూ. 5 లక్షల పైనే ఆస్తి నష్టం వాటిల్లినట్లు లారీ సిబ్బంది చెబుతుండగా.. అగ్నిమాపక సిబ్బంది మాత్రం రూ.2.5 లక్షల వరకూ నష్టం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

విధులకు ఆటంకపరిచారని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గతంలో సహాయ సంచాలకులుగా పనిచేసిన పి.సూర్యారావు ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది విధులకు ఆటంకపరుస్తున్నారంటూ ప్రస్తుత ఆ శాఖ సంయుక్త సంచాలకుడు రాజగోపాల్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ పి.ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. గతంలో సస్పెన్షన్‌కు గురైన సూర్యారావుకు హైకోర్టు సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఈ క్రమంలో సూర్యారావు కొంతమంది పత్రికా విలేకరులు, వీడియోగ్రాఫర్లను తన వెంట జిల్లా పశుసంవర్ధక కార్యాలయానికి తీసుకెళ్లి విధి నిర్వహణ నిమిత్తం తాను వచ్చానని, అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకం పెడతానంటూ చెప్పడమే కాక వచ్చే పత్రికా విలేకరులతో వీడియో రికార్డింగ్ చేయించారన్నారు. పశుసంవర్ధక శాఖ విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి తగు ఉత్తర్వులు వచ్చేంతవరకు కార్యాలయంలో సూర్యారావును జాయిన్ చేసుకునే అవకాశం లేదని ఎంత చెప్పినప్పటికీ సిబ్బందిని భ భయభ్రాంతులకు గురిచేసి విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు.

మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి

- మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో


వర్చువల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో

భువనేశ్వర్: వర్షాలకు ముందు పట్టణ ప్రాంతాల సన్నద్ధత గురించి గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి విభాగం మంత్రి డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో పట్టణ ప్రాంతాలకు చెందిన వివిధ అధికారులతో మంగళవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. వానా కాలంలో కృత్రిమ వరద పరిస్థితిని ప్రేరేపిస్తున్న నీటి ప్రవాహ అడ్డంకి పరిస్థితుల నివారణ కోసం ఈ సమావేశం నిర్వహించడం విశేషం. వాన, మురికి నీరు ప్రవాహ వ్యవస్థ పరిస్థితిని పరిశీలించి, అడ్డంకులు మరియు అవసరమైన మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రవాహ అడ్డంకితో ముంపునకు గురి అవుతున్న ప్రాంతాలను గుర్తించి సత్వర కార్యాచరణతో సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. బకాయి ఉన్న హోల్డింగ్ పన్ను వసూలు చేయడంపై యంత్రాంగం శ్రద్ధ వహించాలన్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

డ్రైనేజీ వ్యవస్థపై సమీక్ష

నగర, పట్టణ ప్రాంతాల్లో వర్షాకాలంలో తలెత్తే కృత్రిమ వరద పరిస్థితి ప్రాంతీయుల దైనందిన జీవన శైలికి అంతరాయం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ సందర్భంగా నగరంలో డ్రైనేజీ వ్యవస్థని మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభావిత ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ వాస్తవ స్థితిగతుల్ని ప్రత్యక్షంగా సమీక్షించారు. కృత్రిమ వరద పరిస్థితి పునరావృతం కాకుండా స్థిరమైన డ్రైనేజీ పరిష్కారాలను అన్వేషణ అనివార్యమని మంత్రి అధికారులకు తెలిపారు. రాష్ట్రంలో ఈ నిరంతర పట్టణ, నగర సవాళ్లను పరిష్కరించడానికి గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి విభాగం మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో మంగళవారం నగరంలోని అనేక కీలక ప్రదేశాలపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కమిషనర్, బీఎంసీ ఇంజినీర్, స్థానిక ఎమ్మెల్యే బాబూ సింగ్ మరియు అనేక మంది కార్పొరేటర్లతో కలిసి మంత్రి సంయుక్తంగా తనిఖీ చేసి, తక్షణ మరియు దీర్ఘకాలిక పరిష్కార చర్యలపై చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ దార్శనికతకు అనుగుణంగా వర్షపు నీటి ప్రవాహ నీటి నిర్వహణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉందన్నారు. నీటి ప్రవాహ మార్గం మూసుకుపోవడంతో ఈ పరిస్థితులు తాండవిస్తున్నట్లు గుర్తించారు. ఈ సమస్య నివారణకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సిద్ధం చేయాలని యోచిస్తున్నారు. 10వ నంబర్ డ్రెయిన్‌లోకి వర్షం, వినియోగించిన నీటిని విడుదల చేయడానికి ప్రయత్నించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇస్కాన్ నుంచి వాణి విహార్ వరకు ప్రత్యేక మురుగు నీరు ప్రవాహ వ్యవస్థ ఏర్పాటు అవుతుందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక సర్దుబాటుతో కాలక్షేపం చేయడం సోపానంగా భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



రోడ్డు భద్రతకు సంబంధించిన ఈ అద్భుతమైన సైకత శిల్పం అంతర్జాతీయంగా ప్రఖ్యాత సైకత కళాకారుడు పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ తీర్చిదిద్దారు. శూన్య దుర్ఘటన దినం పురస్కరించుకుని ఈ శిల్పం ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నాడు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజలకు అవగాహన కల్పించడంలో అందరి సహకారాన్ని కూడగట్టుకుని ముందుకు సాగడం ఈ కళాకృతి లక్ష్యంగా పేర్కొన్నారు. రహదారి భద్రతతో ఇంటికి సురక్షితంగా చేరాలనే నినాదంతో రూపుదిద్దుకున్న ఈ శిల్పం పలువురి దృష్టిని ఆకట్టుకుంది.

- భువనేశ్వర్

జీఎస్టీ ఆదాయంలో క్షీణత

- జనవరి నుంచి మే వరకు రూ.15 కోట్లకుపైగా తగ్గిన ఆదాయం
- ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి
- గతంలో పథకాలు రావడంతో పెరిగిన లావాదేవీలు
- కూటమి వచ్చాక పథకాలు లేక తగ్గిన కొనుగోళ్లు



- జిల్లాలో 2024లో జనవరి నుంచి మే వరకు రడీమేడ్ వస్త్ర వ్యాపారం రూ.120 కోట్లకు పైగా జరిగింది. ఈ ఏడాది అది రూ.80 కోట్లకు తగ్గింది.
- జిల్లా వ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్లలో జనవరి నుంచి మే వరకు రూ.50 కోట్లకు పైబడి వ్యాపారం జరిగేది. ఈ ఏడాది అది రూ.35 కోట్లకు పరిమితమైంది.
- కిరాణా సరుకులు, నిత్యావసర సరుకుల క్రయవిక్రయాలు జనవరి నుంచి మే వరకు రూ.800 కోట్లు వరకు జరిగేవి. ఈ ఏడాది రూ. 550 కోట్లు వరకు మాత్రమే జరిగాయి.

శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల కొనుగోళ్ల శక్తి తగ్గడంతో ఆ ప్రభావం జీఎస్టీ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలో అన్ని వ్యాపారాలు కలిపి జనవరి నుంచి మే నెల వరకు రూ.1500 కోట్లు మేర లావాదేవీలు జరిగాయి. దీని ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీ రూపేణా ఆదాయం లభించింది. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.15 కోట్లకు పైగా జీఎస్టీ ఆదాయం తగ్గింది. మద్యం మినహాయిస్తే ఏ వ్యాపారాన్ని చూసినా గతేడాది కంటే ఈ ఏడాది 5 నెలల్లో లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే చాలా వ్యత్యాసం కన్పిస్తోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడమే దీనికి కారణం.

పథకాల్లో కోత..

గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు సకాలంలో అందేవి. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, చేదోడు, రైతు బీమా, సున్నా వడ్డీ, కాపు నేస్తం వంటి ఎన్నో పథకాలు సకాలంలో అందేవి. దీంతో పేద ప్రజలు తమకు కావాల్సిన నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్లు సకాలంలో ఇస్తున్నప్పటికీ చాలా మందికి కోత విధించారు. తల్లికి వందనం, మహిళలకు రూ.1500, రైతు బీమా, సున్నా వడ్డీ వంటివాటితో పాటు సూపర్ సిక్స్ అంటూ ఎన్నో పథకాలను అమలు చేయకుండా వదిలేశారు. మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్లాన్ అప్రూవల్ జరగకపోవడం, ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. రైతుకు సహాయం చేసే పథకాలు ఎత్తివేయడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వ్యవసాయ పనులు కూడా తగ్గిపోయాయి. వీటి కారణంగా కూలి పనులు లేకుండా పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు పెరిగిపోతుండగా ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీలతో పాటు మరెన్నో ప్రయోజనాలు అందడం లేదు. ఉద్యోగ విరమణ చేసిన వారికి సైతం గ్రాట్యుటీ వంటి ఇతర ప్రయోజనాలకు మంజూరు చేయకపోవడం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవటం, ఉపాధి హామీ వేతనదారులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు జరపకపోవటంతో జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అన్ని వర్గాల వారిపై వేటు వేయడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయింది. ఈ కారణంగానే లావాదేవీలు తగ్గి జీఎస్టీ ఆదాయం తగ్గిపోయింది.

జీఎస్టీ ఆదాయ వివరాలివే..

2024లో జనవరి 1 నుంచి మే 31 వరకు రూ.105.96 కోట్లు ఆదాయం లభించింది. 2025లో జనవరి 1 నుంచి మే 31 వరకు రూ.86.05 కోట్లకే ఆదాయం పరిమితమైంది. సర్కిళ్ల వారీగా పరిశీలిస్తే 2024 ఆమదాలవలస సర్కిల్లో రూ.17.85 కోట్లు, 2025 రూ.14.25 కోట్లు, కాశీబుగ్గలో 2024లో రూ.8.52 కోట్లు, 2025లో రూ.9 కోట్లు, నరసన్నపేట సర్కిల్‌లో 2024లో రూ.10.05 కోట్లు, 2025లో రూ.11.15 కోట్లు , 2024లో శ్రీకాకుళం సర్కిల్‌లో రూ.68.87 కోట్లు, 2025లో రూ.51.75 కోట్లు ఆదాయం వచ్చింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్: శారీరక ఆరోగ్యానికి, మానసిక దృఢత్వానికి ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం రూరల్ మండలం పెదగన్నవానిపేట సముద్ర తీరంలో సుమారు ఐదు వేల మందితో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులు ప్రతిరోజూ వేటకు వెళ్తారని, వారికి యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మనసు, శ్వాస, వ్యాయామమే యోగాసనమన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత, మహిళా శిశుసంక్షేమశాఖాధికారి బి.శాంతి, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

పాముకాటుతో కల్లుగీత కార్మికుడు మృతి

ఎచ్చెర్ల : అరిణాం అక్కివలస గ్రామ సమీపంలో బుడుమూరు గ్రామానికి చెందిన పాలుసు గోపి (39) మంగళవారం సాయంత్రం పాము కాటుకు గురై మృతి చెందాడు. గోపి వృత్తిరీత్యా తాటికల్లు తీసేందుకు అరిణాం అక్కివలస వచ్చి తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా పాము కాటువేసింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గోపికి భార్య దేవి, కుమారుడు ఉన్నారు. ఎచ్చెర్ల ఎస్సై ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగుల్‌లో ఆడ ఏనుగు మృతి


డొంగాపాల్ ప్రాంతంలో మృత ఏనుగు

భువనేశ్వర్: అంగుల్ జిల్లా చెండీపాదా అటవీ ప్రాంతం డొంగాపాల్ సమీపంలో సౌరశక్తితో నడిచే కంచె దగ్గర ఆడ ఏనుగు చనిపోయి పడి ఉన్నట్లు దృష్టికి వచ్చింది. దీని వయసు దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని అటవీ అధికారుల అంచనా. ఈ జిల్లాలో వారం రోజుల స్వల్ప నిడివిలో వరుసగా ఇది రెండో ఏనుగు మరణం కావడం కలవరం సృష్టిస్తోంది. అడవి జంతువులు జనావాసాల్లోకి చొరబడకుండా సరిహద్దు ప్రాంతాల్లో రక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న భద్రత కంచె ఏనుగులకు ప్రాణాంతకంగా పరిణమిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ భూముల్లోకి ఏనుగులు చొరబడి పంట నష్టం నివారించేందుకు రైతాంగం ఈ చర్యకు పాల్పడుతున్నారు. గత నెల 31న ఇటువంటి ఘటనలో అంగుల్ జిల్లా బొంతొలా అటవీ మండల పరిధిలో తాలాసారా సమీపంలో 8 నుంచి 10 సంవత్సరాల వయస్సు గల ఒక గున్న ఏనుగు మృతి చెందింది. తాజా మరణానికి కారణం అస్పష్టంగా ఉందని అటవీ అధికారుల సమాచారం. శవ పరీక్ష నివేదిక అందితే స్పష్టం అవుతుందని వేచి చూస్తున్నారు. జనావాసాల్లో ఏనుగుల చొరబాటుతో తలెత్తే సంఘర్షణను తగ్గించే లక్ష్యంతో అటవీ శాఖ సౌర విద్యుత్ భద్రత కంచె చేపట్టిన చొరవలో భాగం. తాజా సంఘటనల దృష్ట్యా అటువంటి కంచెల దగ్గర సంభవిస్తున్న ఏనుగుల మరణాలు ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. అంగుల్, ఢెంకనాల్ మరియు కెంజొహర్ వంటి అటవీ సరిహద్దు జిల్లాల్లో ఈ విషమ పరిస్థితి తాండవిస్తుంది.

4 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గుజరాత్‌కు అక్రమంగా గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యవకులను ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవా పోలీసులు తనిఖీలు నిర్వహిండగా.. బీహార్‌లోని బాగల్‌పూర్‌జిల్లా కానరి గ్రామానికి చెందిన ఎండీ షెకావత్ అనే యువకుడు, ఒడిశాలోని గంజాం జిల్లా పాత్రపూర్‌బ్లాక్ ధర్మపూర్ గ్రామానికి చెందిన దల బెహర చిత్రసేన్ అనే యువకుడు బ్యాగ్‌లలో 3.990 గ్రాములు గంజాయితో పట్టుబడ్డారు. బీహార్‌కి చెందిన ఎండీ షెకావత్ అనే వ్యక్తి గుజరాత్ రాష్ట్రం వాపిలో నివాసముంటూ చిత్రసేన్ ద్వారా ఒడిశా నుంచి గంజాయిని తీసుకెళ్లి అక్కడ గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో చిత్రసేన్ గంజాయిని తీసుకొచ్చి షెకావత్‌కి అందజేసే క్రమంలో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించారు. అక్రమ రవాణాను అడ్డుకున్న పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై ముకుందరావు, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌల్

ఆమదాలవలస: తీర్థయాత్రలకు రైల్వే శాఖ ప్రత్యేక ఎయిర్ రైల్వే ప్యాకేజీలు తీసుకొచ్చినట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌల్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అనుకూలంగా విమాన ప్యాకేజీతో శాంకరీ దేవి శక్తి పీఠం, శ్రీలంక రామాయణ యాత్రలకు విశాఖ నుంచి విమాన సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు. జూన్ 28న మొదలై జులై 3తో ముగుస్తుందని తెలిపారు. ఒక వ్యక్తికి రూ.69,450 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా, కేరళ, గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు సిద్ధం చేశామన్నారు. వివరాలకు 9281030748, 9281495847 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో స్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.ఉమామహేశ్వరరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జి.వినేష్ పాల్గొన్నారు.

స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి


సంఘటన స్థలంలో మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

ఇచ్ఛాపురం రూరల్: స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇచ్ఛాపురంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇదే మండలంలోని లొద్దపుట్టి గ్రామం పెద్ద వీధికి చెందిన దుర్గాశి మహేశ్(45) అదే గ్రామంలో మంగళవారం రేషన్ షాపు డీలర్ వద్ద అసిస్టెంట్‌గా సరుకులు పంపిణీ చేశాడు. అనంతరం పక్క గ్రామమైన ఒడిశా సవరదేవి పేటకు రాత్రి సమయంలో నడకదారిన వెళ్తుండగా.. ఒడిశా గుడ్డిభద్ర గ్రామానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై స్పీడుగా వచ్చి మహేశ్‌ను బలంగా ఢీ కొట్టాడు. దీంతో మహేశ్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో స్కూటీ డ్రైవర్ బండిని వదిలి పరారయ్యాడు. మృతుడి భార్య చాలా రోజుల కిందట మృతి చెందగా పెద్ద కుమార్తెకు పెళ్లి చేశారు. మరో కుమార్తె ఉంది. కుటుంబ సభ్యులు పిర్యాధు మేరకు ఒడిశా జరడా పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా కంచమ్మతల్లి వారోత్సవాలు


పురవీధుల్లో అమ్మవారు ఊరేగింపు


కాళికాదేవి నృత్యం


కంచమ్మతల్లి అమ్మవారి నమూనా విగ్రహం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో నిర్వహిస్తున్న కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు రెండోరోజు మంగళవారం వైభవోపేతంగా జరిగాయి. అమ్మవారిని పీఠ స్థానం నుంచి మఠం కంచిలి తీసుకొచ్చి, అక్కడి నుంచి ఊరేగింపుగా మెయిన్‌రోడ్డులోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నాగదేవతలు, అమలాపురం కేరళ డ్రమ్స్, పద్మనాభపురం దూమ్ ధడాకా, పాలబొమ్మలు, స్థానిక కళాకారుల గ్రూపు డ్యాన్స్, రాజమండ్రి సినీ కోయడ్యాన్స్ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుల చేసిన బొడ్డపాడు కళాకారుల జానపదాలు అలరించాయి. రైల్వేస్టేషన్ కూడలిలో మెయిన్‌రోడ్డు పక్కన కంచమ్మతల్లి అమ్మవారి నమూనా విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. బంగారు, వజ్రాభరణాలను అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఇసుకాసురుల ముందుచూపు!


భైరి తోటల్లో ఇసుక పోగులు

శ్రీకాకుళం రూరల్ :

- రానున్న వర్షాకాలం నేపథ్యంలో ముందస్తుగా భారీగా ఇసుక నిల్వలు
- భైరి, కరజాడ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో 15 వేల టన్నులకు పైగా పోగులు
- స్పందించని రెవెన్యూ, మైన్స్ అధికారులు


భైరి పరిసర ప్రాంతంలో ట్రాక్టర్లతో ఇసుక తవ్వకాలు

ఉచిత ఇసుక విధానం కూటమి నేతల పంట పండిస్తోంది. కొందరు నాయకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తూ నదీ పరివాహక ప్రాంతాల్లో భారీగా ఇసుక వ్యాపారం సాగిస్తూ కోట్ల రూపాయలు జేబులు నింపుకొంటున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో నదీ పరివాహక ప్రాంతాలైన భైరి, కరజాడ ప్రాంతాల్లో రాత్రిపగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రెవెన్యూ, మైన్స్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం.. వీఆర్వో, పంచాయతీ సెక్రటరీలు సైతం తవ్వకాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో తవ్వకాలు అనుమతులు కంటే భారీగా సాగుతున్నాయి. రానున్న వర్షాకాలంలో పెద్ద ఎత్తున ఇసుక వ్యాపారం సాగించేందుకే ఇలా భారీ ఎత్తున ఇసుకను పోగేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వాల్టా చట్టానికి తూట్లు..

వాస్తవంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇచ్చే ముందు గ్రౌండ్ వాటర్ పరిశీలన చేయాల్సి ఉంది. ఇక్కడ తక్కువ మోతాదుల్లో నీటి సాంద్రత ఉండటం, గ్రౌండ్ వాటర్ అడుగంటడం, చుట్టూ వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. భైరి, కరజాడ ప్రాంతాల్లో 1.5 మీటర్లు వరకే తవ్వకాలు చేయాల్సి ఉన్నా దాన్ని అధిగమించి భారీ ఎత్తున తవ్వకాలు సాగిస్తున్నారు.

ఇరువైపులా ఇసుక పోగులే..

భైరి నుంచి కరజాడ జంక్షన్ జాతీయ రహదారి మీదుగా వెళ్లే వంశధార నదికి ఆనుకొని ఉన్న ప్రదేశంలో కొన్ని వేల మెట్రిక్ టన్నుల ఇసుకను కూటమి నేతలు నిల్వ చేసేశారు. బ్రిడ్జికి రెండువైపులా ఎక్కడికక్కడ ఇసుక పోగులు కనిపిస్తుంటాయి. అక్కడితో ఆగకుండా తోటలు, పంట పొలాల గట్లుపై కూడా సుమారు 15వేల టన్నులకు పైగా ఇసుక నిల్వలు పోగేశారు.


కరజాడకు వెళ్లే తోటల్లో ఇసుక పోగులు


భైరి కరజాడ బ్రిడ్జి కింద ఇసుక నిల్వలు

ముందస్తు వ్యూహం..

ప్రస్తుతం చేస్తున్న పోగేస్తున్న ఇసుక నిల్వలతో రానున్న వర్షాకాలంలో మరింతగా ఇసుక వ్యాపారం చేసి లాభాలు గడించాలని అక్రమార్కులు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న రేట్లు కన్నా వర్షాకాలంలో డబుల్, త్రిబుల్ రేట్లుగా వేసుకొని ఇసుకను బ్లాక్‌మార్కెట్‌లో అమ్మడం కోసమే బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో నిల్వలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

దాడులు చేస్తాం..

అక్రమ ఇసుక నిల్వలపై కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, మైన్స్ అధికారులు రెండు బృందాలుగా వీడి తనిఖీలు చేయనున్నాం. ఎక్కడ అక్రమంగా నిల్వలు ఉన్నా సీజ్ చేస్తాం.

– మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్, మైన్స్

క్లుప్తంగా

కార్మిక శాఖ సహాయ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



నూతన కార్మికశాఖ సహాయ కమిషనర్‌గా జి.ఎల్లాజీ రావు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం కార్మికశాఖ సహాయ నూతన కమిషనర్‌గా జి.ఎల్లాజీ రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఏటీ శ్రీనివాసులు నుంచి ఉదయం 10 గంటలకు బాధ్యతలు తీసుకుని విధుల్లో చేరారు. అనంతరం కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక శాఖ ఉప కమిషనర్, సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, నాణ్యమైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

తులసిరామినాయుడువలసలో ఏనుగులు



దళాయివలస పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: పదిరోజుల నుంచి మండలంలోని సుంకి, సంతోషపురం, గొట్టివలస తదితర గ్రామాల్లో సంచరిస్తున్న ఏనుగులు గడిచిన రెండు రోజుల నుంచి తులసిరామినాయుడువలస, దళాయివలస గ్రామాల్లో సంచరిస్తున్నాయి. మంగళవారం పార్వతీపురం-గరుగుబిల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పరిధిలో ఏనుగులు సంచరిస్తుండడంతో రాకపోకలు చేసేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట పొలాల్లో ఉన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా పలుమార్లు శారీరకంగా అనుభవించాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందివలస వాసు అనే వ్యక్తిపై పోక్సోతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలతో డీఎస్పీ శ్రీనివాసరావు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితుడిని కోర్టులో ప్రవేశపెడతామని ఎస్సై చెప్పారు.

ఆకస్మికంగా సబ్‌జైల్ తనిఖీ

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న సబ్‌జైలును విజయనగరం జిల్లా న్యాయమూర్తి ఎం.బబిత మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైల్లో వసతులను ఈ సందర్భంగా పరిశీలించి ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి అక్కడి పరిస్థితుల పట్ల ఆరాతీశారు. నిబంధనల ప్రకారం చక్కటి నడవడిక, నైతిక విలువల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖైదీలకు సూచించారు. ఖైదీల ఆరోగ్యంపట్ల తీసుకుంటున్న చర్యలపై సబ్‌సైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. పలు విభాగాలను తనిఖీ చేసి ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఒక అడ్వకేట్, ఒక పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సలహాలను అందిస్తారని చెప్పారు. ఖైదీలు సత్ప్రవర్తనతో తమకు విధించిన శిక్షను పూర్తిచేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు లేని ఖైదీలకు ఉచితంగా నియమించనున్నట్లు తెలిపారు. 70ఏళ్ల పైబడిన వారికి, అలాగే అనారోగ్యంతో బాధ పడేవారికి బెయిల్ మంజూర య్యేలా కృషిచేస్తామన్నారు. ఈ పరిశీలనలో పార్వతీపురం జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కు వెళ్తూ ప్రమాదానికి గురైన వ్యక్తి

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వం రేషన్ విషయంలో అవలంబించిన విధానంతో రాజాంలోని ఓ వ్యక్తి మంగళవారం ప్రమాదం బారినపడి ఆస్పత్రి పాలయ్యాడు. దీనికి సంబంధించి టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన రాగోలు విశ్వనాథం రేషన్ సరుకులు విడిపించేందుకు మల్లయ్యపేటలోని డిపోకు సైకిల్‌పై వస్తున్నాడు. సిరి కల్యాణమంటపం వద్దకు వచ్చేసరికి అదే సమయంలో బొబ్బిలి నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన విశ్వనాథం తల, కాలికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

పైడితల్లికి పుష్పాలంకరణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్ప సేవ నిర్వహించారు. చదురుగుడి, వనంగుడిలలో కొలువైన పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారికి లడ్డూలతో నివేదన చేశారు.

అంబరాన్నంటిన సిరిమాను సంబరం

- వైభవంగా సాగిన ముగ్గురమ్మల జాతర
- వేడుకగా సాగిన ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మల సిరిమానుల తిరువీధి
- తరలివచ్చిన భక్తజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రత్యేక అలంకరణలో ఎర్రకంచమ్మ అమ్మవారు



ఇప్పలపోలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఎర్ర కంచమ్మను దర్శించుకున్న ఎస్పీ



ఇప్పల పోలమ్మ అమ్మవారి సిరిమానోత్సవం



సిరిమానును అధిరోహించిన పూజారి జన్ని రామారావు

పార్వతీపురం టౌన్:

మంగళ వాయిద్యాలు.. భక్తుల జయజయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనలు.. కళాకారుల వేషధారణల నడుమ ఇప్పలపోలమ్మ, ఎర్రకంచెమ్మ అమ్మవార్ల సిరిమానోత్సవం మంగళవారం సంబరంగా సాగింది. సిరిమాను పూజారుల రూపంలో వీధిల్లోకి తరలివచ్చిన అమ్మవార్లను తిలకించేందుకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకు చెందిన లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. వీరితో పార్వతీపురం పట్టణం జనసంద్రంగా మారింది. అమ్మవార్లను కనులారా వీక్షించిన భక్తులు జయజయధ్వానాలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లను పూజించారు. అమ్మవార్ల పూజార్లు జన్నిరామారావు, నక్క వాసుదేవరావులు అమ్మవారి దండకం చదివి సాయంత్రం 5 గంటల సమయంలో సిరిమానును అధిరోధించారు. అంజలి రథంపై పేడి వేషధారుల నాట్యం అనంతరం సిరిమాను తిరువీధి ప్రారంభమైంది. అమ్మవార్లను ఎమ్మెల్యేలు బోనెల విజయ చంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయరాజు, తదితరులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సిరిమాను సంబరం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తప్పెటగుళ్లు, కోలాటం, అమ్మవార్ల వేషధారణలు, కాంతారా, బళ్ల వేషాలు ఆకట్టుకున్నాయి.

450 మందితో పోలీస్ బందోబస్తు

పార్వతీపురం ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి ఆధ్వర్యంలో 450 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. 40 సీసీ కెమెరాలు అమర్చి పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు జిల్లా కేంద్ర సరిహద్దుల్లో భారీ వాహనాలను నిలిపివేసి, అత్యవసర, కార్లు, ద్విచక్ర వాహనాలను బైపాస్ మార్గం గుండా మళ్లించారు. పోలీస్ బందోబస్తును ఎస్పీతో పాటు ఏఎస్పీ అంకిత సురాన, పట్టణ సీఐ కె.మురళీధర్, ఎస్‌బీ సీఐ పి.రంగనాథం, సీసీఎస్ సీఐ అప్పారావు పర్యవేక్షించారు.

డబ్బులివ్వకపోతే ఖబడ్దార్..!

- డబ్బుల కోసం బాలికకు యువకుడి వేధింపులు
- ఫేక్ ఇన్‌స్టాగామ్ ఖాతాలో అసభ్యకర పోస్టులు
- నిందితుడిపై కేసుల నమోదు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ భవ్యారెడ్డి



పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

రామభద్రపురం: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నా..చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుడండం, సైబర్ నేరగాళ్లు కూడా రకరకాల యాప్‌ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.అక్రమంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఫేక్ ఇన్‌స్టాగామ్ ఖాతా తెరిచి అసభ్యకర పోస్టులు పెట్టి డబ్బులు ఇవ్వాలంటూ ఓ ఆడపిల్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఓ నిందితుడు పోలీసులకు మంగళవారం చిక్కాడు. ఈ సంఘటనపై డీఎస్పీ భవ్యారెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం భైరిపురంగ్రామానికి చెందిన ఓ యువకుడు ఒడిశాలో ఐటీఐ చదువుతున్నాడు. అక్కడ ఫేక్ ఇన్‌స్టాగామ్ ఓపెన్ చేసి అందులో ఆడపిల్లల ఫొటోలు పెట్టి లైక్‌లు కొట్టమని ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పెట్టేవాడు. ఈ క్రమంలో రామభద్రపురం గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక స్నేహితురాలి ఫొటో మార్ఫింగ్ చేసి, ఇన్‌స్టాగామ్ యాప్‌లో పెట్టి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా రామభద్రపురం గ్రామానికి చెందిన బాలిక తన స్నేహితురాలే కదా అని లైక్ కొట్టింది. దీంతో ఆ కుర్రాడు ఆ ఇన్‌స్టాగామ్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ అయిన బాలిక ఫొటోలు స్క్రీన్‌షాట్ తీశాడు.ఆ ఫొటోలను వాడి మొబైల్ ఫోన్‌లోనే నగ్నంగా మార్ఫింగ్ చేసి ఉంచుకున్నాడు. ఇవేవీ అ బాలికకు తెలియదు. బాలిక స్నేహితురాలు అడిగినట్లుగానే నాకు అవసరం ఉంది ఓ రూ.500 కావాలని అడిగాడు. ఆమె తన దగ్గర లేవని సమాధానం ఇచ్చింది. దీంఓ వెంటనే ఆ మోసగాడు నగ్నంగా..అసభ్యకరమైన ఉన్న ఫొటోలు ఆమెకు పంపించి నీవు అర్జెంటుగా రూ.8 వేలు ఇవ్వకుంటే ఈ ఫొటోలు సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లలో పెడతానంటూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాడు.

పోలీసులను ఆశ్రయించిన బాధిత బాలిక

దీంతో ఆ బాలిక నీవు అలా చేస్తే నేను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తమై స్థానిక పోలీసులను ఆశ్రయించారు.ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సీఐ కె నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావులు మే 2వ తేదీన కేసున మోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికతను ఉపయోగించి సైబర్ మోసానికి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకుని, విచారణ చేసి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరం, పోక్సో కింద నిందితుడిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌కు వచ్చే లింక్‌లు క్లిక్ చేయొద్దని,సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లు మంచి కోసం ఉపయోగించాలని, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లు ఖాతాలు ఓపెన్ చేయడం ఆడపిల్లలకు అవసరం లేదన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూసి అకర్షణకు లోనై మోసపోకూడదని హితవు పలికారు. వేగంగా కేసును ఛేజ్ చేసిన సీఐ నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావులను అభినందించారు.

లారీ ఢీకొని ఆర్మీ జవాను దుర్మరణం



బొబ్బిలి రూరల్: సత్యం మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుమార్తెలు



మృతుడు సత్యం (ఫైల్)

బొబ్బిలి రూరల్/బాడంగి: బొబ్బిలి మండలంలోని పారాది గ్రామం వద్ద మంగళవారం లారీ ఢీ కొన్న ఘటనలో ఆర్మీ జవాను తూముల సత్యం(53) దుర్మరణం చెందారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన తూముల సత్యం మోటార్‌సైకిల్‌పై బొబ్బిలి నుంచి రామభద్రపురం వెళ్తుండగా పారాది బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో సత్యం అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను స్థానికుల నుంచి ఆరాతీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో మృతుడి కుటుంబం, గ్రామస్తులు



బాడంగి: రోదిస్తున్న మృతుడి తల్లి, సోదరులు

ఆర్మీ జవాను తూముల సత్యం (52) రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ఒక్కసారిగా ముగడ గ్రామం మూగబోయింది. మృతుడి తండ్రి సోములు గతంలో మృతిచెందగా తల్లి అప్పమ్మ మరోముగ్గురు సోదరులున్నారు.వారిలో సత్యం మూడవవాడు. ఆయన 1994లో ఆర్మీలో చేరగా మిగిలినవారు వ్యసాయం చేసుకుంటున్నారు. ఆయనకు 2001లో నాగరత్నంతో వివాహం జరిగింది. వారికి బీటెక్ చదివిన అబ్బాయి అరవింద్, విశాఖలో ఆంధ్రా యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతున్న అమ్మాయి హిమబిందు ఉన్నారు. ఆయన తొమ్మిదేళ్ల క్రితమే బొబ్బిలిలోని గొల్లవీధిలో ఇల్లు కొనుగోలు చేసి భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నారు. ఇదిలాఉండగా ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ ఏఎస్సైగా ఆయనకు ప్రమోషన్ రాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్‌లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన అక్క రామభద్రపురంలో ఉంటున్నందున తాను బుధవారం వెళ్లిపోతున్నానని చెప్పేందుకు బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. రోడ్డు ప్రమాదంలో సత్యం మృతి చెందడంతో భార్యాపిల్లలు, తల్లి, సోదరులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్మీ జవాను మృతదేహానికి బుధవారం ముగడ గ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి.

వైద్యసిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం



అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

- గర్భిణుల మృతిపట్ల సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశాలు

విజయనగరం ఫోర్ట్: వివిధ కారణాలతో ప్రసవ సమయంలో, ప్రసవానంతరం గర్భిణులు, శిశువులు మృతి చెందడం పట్ల కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నవంబర్ 24 నుంచి మార్చి 2025 వరకు జిల్లాలో సంభవించిన నాలుగు మాతృమరణాలు, ఐదు శిశు మరణాలపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు, సిబ్బంది లేకపోవడం వల్ల, వైద్యుల నిర్లక్ష్యం, ఏ స్థాయిలో తప్పిదం జరిగి ఉంటుంది తదితర కారణాలపై ఆరా తీశారు. వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశ, ఏఎన్‌ఎంలను ప్రశ్నించారు. అన్ని రికార్డులను సమర్పించాలని ఆదేశించారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులు సమావేశానికి రాకపోవడంపై మండిపడ్డారు. గర్భిణులు వెంపడాపు లీలావతి, బంగారి సుధ మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కొరమ దుర్గ మృతి విషయంలో పీజీ స్టార్ ఆస్పత్రికి నోటీస్ ఇవ్వాలని, అలాగే మరో మృతికి సంబంధించి సమావేశానికి కేజీహెచ్ వైద్యులు రాకపోవడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు కూడా లెటర్ రాయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొంతన లేని నివేదికలు

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ఇస్తున్న నివేదికలు పొంతన లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో ఇరు శాఖల అధికారులు నెలకోసారైనా సమావేశమై చర్చించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎన్.పి.పద్మశ్రీరాణి, ఘోషాఆస్పత్రి గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ అరుణశుభశ్రీ, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన దుర్గాప్రసాద్

కొత్తవలస: మండలంలోని గులివిందాడ గ్రామానికి చెందిన కోట దుర్గాప్రసాద్ (22) అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కొత్తవలస పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గాప్రసాద్ నర్సీపట్నం సమీపంలోని ఓ కోళ్లఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత నెల 27వ తేదీన సెలవుపై సొంతూరు వెళ్తున్నట్లు ఫామ్ యజమానికి తెలిపాడు. అదే రోజు కొత్తవలసలో దుర్గాప్రసాద్ తన బావమరిదికి కనిపించినప్పటికీ ఇంటికి మాత్రం చేరలేదు. యువకుడి మోటర్ సైకిల్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు దుర్గాప్రసాద్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీఎం సూర్యఘర్‌తో పర్యావరణ హితం

పార్వతీపురంటౌన్: పీఎం సూర్యఘర్ పర్యావరణ హితమైనదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. పర్యావరణ దినోత్సవం, పీఎం సూర్యఘర్, యోగాంధ్ర తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాయితీపై సూర్యఘర్ యూనిట్లు మంజూరు చేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో జూన్ 5వ తేదీన జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం పేర్కొన్నారు. అటవీశాఖ వద్ద 15 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. చౌకధరల దుకాణాల వద్ద రేషన్ లబ్ధిదారులు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జేసీ ఎస్.ఎస్.శోభిక మాట్లాడుతూ చౌక ధరల దుకాణాలకు వచ్చిన వారికి వీలైనంత వేగంగా సరుకులు అందజేసి పంపించివేయాలన్నారు. యోగాంధ్రంలో భాగంగా కురుపాంలో ఈ నెల 8వ తేదీన సీనియర్ సిటిజన్‌లతో యోగా కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పీఓలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామ చంద్రరావు, డీపీఓ టి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దక్కని ఆశించిన 'మద్దతు'

- అరకొరగా వరి క్వింటాకు రూ.69 పెంపు
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు



వరిపంట

పార్వతీపురం/విజయనగరం ఫోర్ట్: విత్తనాలు, ఎరువులు సాగు వ్యయం రోజురోజుకూ తడిసి మోపెడవుతోంది. ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూలీల ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. ట్రాక్టర్లతో వ్యవసాయం చేయడంతో డీజిల్ ధరలు కూడా తగ్గనంటున్నాయి. ఈ ధరాభారంతో రైతుల సాగు వ్యయం ఏటా పెరిగిపోతోంది. ఖర్చులు, ధరలు పెరిగే స్థాయిలో మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మద్దతు ధర సాగు వ్యయానికి అనుగుణంగా ఉంటుందని ఆశించినప్పటికీ రైతులకు నిరాశనే కలిగించింది. వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించింది. గిట్టుబాటు ధర ఎలా ఉన్న మద్దతు ధర సాగు వ్యయం ఆధారంగా పెరుగుతుందని ఆశపడిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. మొక్కుబడిగా వరి పంటకు మద్దతు ధరను కేంద్రం పెంచిందని రైతుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయకుండా పాలకులు మోసగిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు, వ్యయానికి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు ఏ మాత్రం పొంతన లేకపోవడంతో రైతులు ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.69 పెంచి రైతులను ప్రభుత్వం దగా చేసిందని వాపోతున్నారు. ఎంతోకాలంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదు. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2,300ల నుంచి రూ.2369కి పెంచి రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చింది.

పంట పండించాలంటే నష్టపోవాల్సిందే..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రధానమైన వరిపంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఏటా మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులకు మద్దతు ధర అందివ్వని పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ వాస్తవానికి దళారుల నుంచి రైతుల పేరు మీద మిల్లర్లకు తరలించే పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా రైతులకు మద్దతు ధర అందని ద్రాక్షగా మిగిలింది. ఉమ్మడి జిల్లాలోని పలుగ్రామాల్లో ఎకరాకు 24 నుంచి 28 బస్తాల వరకు దిగుబడి వస్తోందని పంట దిగుబడి ప్రయోగాలద్వారా నిర్ధారించి అధికారులు ప్రకటించారు. దిగుబడుల ఆధారంగా మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2369 ప్రకారం 80 కిలోల బస్తాకు రూ.1790లు వస్తుంది. ఈ ప్రకారం 25 బస్తాలకు రూ.40వేల వరకు ఆదాయం రాగా, ఎకరాకు పెట్టుబడిగా రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు వ్యయం అవుతోంది. ఈ లెక్కన రైతుకు మిగిలేది రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే. అదే రైతు కూలికి వెళ్తే ఏడాదికి రూ. ఒక లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. సొంతభూమి సాగు చేసుకునే రైతుకు కొంతవరకు మిగులు కనిపించే అవకాశం ఉండగా కౌలు రైతుకు కౌలు, ఖర్చులు పోను మిగిలేది అంతంతమాత్రమేగానే ఉంది.

మద్దతు ధరపై పునరాలోచన చేయాలి



ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర సాగు ఖర్చులకు వచ్చిన ఆదాయానికి పొంతన ఉండడం లేదు. రోజురోజుకూ వ్యవసాయ మదుపులు పెరిగిపోతున్నాయి. కూలీలు కూడా దొరకడం లేదు. వ్యవసాయం చేయాలంటే ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు కేవలం మొక్కుబడిగా మద్దతు ధర పెంచి మమ అనిపించి రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం వరి పంటకు మద్దతు ధర పెంచడంపై పునరాలోచించి రైతులకు న్యాయం చేయాలి.

–బి.అప్పలనాయుడు, రైతు, నాగూరు